పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

సాక్షి, సిటీ బ్యూరో: మాదాపూర్ మేకలమండీ పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్ ప్రభుత్వ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి, దంత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 230 మందికి పైగా విద్యార్థులు, సిబ్బందిని పరీక్షించారు. దృష్టి సమస్య ఉన్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఉచితంగా అద్దాలు అందజేస్తామని ఆ శాఖ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సౌజన్యంతో పాఠశాలకు టూత్‌పేస్టు, బ్రష్‌లను అందజేశారు. కార్యక్రమంలో రొటేరియన్లు లక్ష్మి, రమ, కుమారస్వామి, మధుకర్‌లు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి మంగళవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్‌ను కోరారు.

ఐదేళ్లయినా అంతే..

- రూ.90 లక్షలు వృథా
- అదే బాటలో.. హుడా కాలనీ మోడల్ మార్కెట్
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినా పట్టించుకోని అధికారులు

వినియోగంలోకి రాని వీధి వ్యాపారుల సముదాయం



చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని చందానగర్ రైల్వే స్టేషన్ వద్ద లక్షల రూపాయలతో నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం వృథాగా మారింది. మంజీరా రోడ్డులో వీధి వ్యాపారులతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని జీహెచ్ఎంసీ అధికారులు ప్రత్యేక స్థలం కేటాయించి రూ.90 లక్షలతో దుకాణ సముదాయం నిర్మించారు. ఆకర్షణీయంగా రంగు రంగులతో పండ్లు, కూరగాయల బొమ్మలు గీయించి, నంబర్లు రాశారు. కానీ ఇప్పుడు దానిని పట్టించుకున్న వారు లేరు. కాగా వీధి వ్యాపారులు మంజీరా రోడ్డులో యథావిధిగా వ్యాపారం చేసుకుంటున్నారు. నిరుపయోగంగా మారిన దుకాణ సముదాయంలో పేదలు ఉంటున్నారు. కాగా హుడా కాలనీ మోడల్ మార్కెట్ పరిస్థితి దాదాపుగా ఇలాగే ఉంది.

- చందానగర్ బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో వీధి వ్యాపారాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది.
- వారాంతపు సంతలతో వ్యాపారులు వీధి వ్యాపారుల సముదాయానికి రావడానికి ఆలోచిస్తున్నారు.
- ఈ ప్రాంతంలో చెత్త చెదారం, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. రాత్రి సమయాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెలువడుతున్నాయి.
- రోడ్డుపై భిక్షాటన చేసేవారు ఈ సముదాయంలో నివాసముంటున్నారు.
- హుడా కాలనీలో గత 5 సంవత్సరాల క్రితం నిర్మించిన మోడల్ మార్కెట్‌ను వీధి వ్యాపారులకు కేటాయించకపోవడంతో అది కూడా నిరుపయోగంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి.
- జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు రోడ్డు పక్కన వ్యాపారాలు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- కాగా అధికారులు ప్రణాళిక లేకుండా జన సమ్మర్దం లేని చోట దుకాణ సముదాయం నిర్మించడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు అంటున్నారు.

నిరుపయోగంగా మారాయి..



చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయంలో దుకాణాలు కేటాయించడంలో జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారాయి. ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు స్ట్రీట్ వెండర్లను ఇక్కడకు తరలించాలి. – తిమ్మారెడ్డి, చందానగర్

తాగుబోతులకు అడ్డాగా..



వీధి వ్యాపారులు రాక పోవడంతో రాత్రి అయితే చాలు సముదాయం తాగుబోతులకు అడ్డాగా మారింది. పోలీసు అధికారులు రాత్రి సమయాలలో ఇక్కడ పెట్రోలింగ్ చేయాలి. – వెంకటేష్, హుడా కాలనీ



వీధి వ్యాపారుల సముదాయంలో పేదలు నివసిస్తున్న దృశ్యం





చందానగర్ మంజీరా రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన సైబర్ ఎన్‌క్లేవ్‌వాసులు



ఎమ్మెల్యే గాంధీని కలిసిన సైబర్ ఎన్‌క్లేవ్‌వాసులు

శేరిలింగంపల్లి: సైబర్ ఎన్‌క్లేవ్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. మంగళవారం సైబర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే నివాసంలో ఆయనకు వినతిపత్రాన్ని ఇచ్చారు. సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలో సీసీ రోడ్లతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేసేలా చూస్తామన్నారు. త్వరలో కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, ప్రభాకర్, కాలనీవాసులు రమేష్‌బాబు, వెంకయ్యనాయుడు, హర్షవర్ధన్, ప్రతాప్, జ్యోతికుమార్, రాంబాబు పాల్గొన్నారు.

ఏఐలో మహిళలకు ప్రత్యేక శిక్షణ

రాయదుర్గం: సౌత్ ఏషియన్ విమెన్స్ ఇన్ టెక్ (ఎస్‌ఏడబ్ల్యూఐటీ) పలు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు మంగళవారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ వేదికగా ప్రకటించింది. ముఖ్యంగా కోటి మందికి మహిళలకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు గూగుల్ విమెన్ టెక్ మేకర్స్, ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్, ఫిక్కి ఎఫ్ఎల్ఓ, షిరోస్ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఐటీ–ఐటీఈఎస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, ఎస్ఎస్‌సీ నాస్కామ్ సీఈఓ కీర్తి సేథ్ మాట్లాడుతూ సాంకేతికతలో మహిళల పురోగమనం అని పేర్కొన్నారు. అనితానటరాజన్ మాట్లాడుతూ భారతదేశంలో ఏఐ వృత్తి నిపుణులలో 20 శాతం కన్నా తక్కువ మంది మహిళలు ఉన్నారన్నారు. కార్యక్రమంలో కలిడో సహ వ్యవస్థాపకుడు సంజయ్ వర్మ ప్రసంగించారు.

22 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆది, సోమవారాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 22 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా, జడ్జి 22 మందికి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న హైటెక్స్, హఫీజ్‌పేట్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు

గచ్చిబౌలి: భవన వ్యర్థాలను తరలించే కార్మికులకు అండగా ఉంటామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ హామీ ఇచ్చారు. రాంకీ సంస్థ వారు అధిక ధర నిర్ణయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధరలు తగ్గించి ఆదుకోవాలంటూ హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే గాంధీని మంగళవారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులకు సరైన న్యాయం చేసేలా చూస్తామన్నారు. రాంకీ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి పాత ధరలకే లోడింగ్ చేసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, హైటెక్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు రామకృష్ణ, చందుయాదవ్, బాబు మియా, గోపాల్, మారయ్య, శేఖర్, హఫీజ్‌పేట్ ట్రాక్టర్స్ యూనియన్ సభ్యులు వేణు, మణ్యం, చందు, రమేష్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

రాజేంద్రనగర్: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని కార్మికులకు ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు మందులు అందజేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

చందానగర్: మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని కాపాడదామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. వినాయకచవితి పర్వదినంను పురస్కరించుకొని మంగళవారం హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల ప్రతిమలు పంపిణీ చేయడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శర్మ, మల్లయ్య, రాజు, స్వరూప, కమలమ్మ, నాయకులు పాల్గొన్నారు.

భెల్ ఈడీని కలిసిన నూతన కార్యవర్గం



రామచంద్రాపురం(పటాన్‌చెరు) : నూతనంగా ఎన్నికయిన బీహెచ్ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం భెల్ ఈడి కే.బి.రాజా, జీఎం (హెచ్‌ఆర్) శ్రీనివాస్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సురేందర్, ప్రధాన కార్యదర్శి దేవా అర్జున్, కార్యవర్గాన్ని ఆయన అభినందించారు. సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఎన్నికల అధికారి లావణ్యను అభినందించారు. అధికారులు అమిత్ కుమార్, సత్యభావం, శంకరయ్య, మయబ్రహ్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



పాత రామచంద్రాపురంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : వర్షం కారణంగా పాతరామచంద్రాపురంలో బీసీ బాలికల హాస్టల్ వద్ద రోడ్డుపై వరద నీరు చేరడంతో ఆ ప్రాంతాన్ని మంగళవారం కార్పొరేటర్ పుష్పనగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాస్కర్ అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా ఒక మొక్కనైన నాటి పెంచాలని కోరారు. పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు



సమావేశంలో పాల్గొన్న వీసీ సయ్యద్ ఐనుల్ హసన్ తదితరులు

రాయదుర్గం: జానపద సాహిత్యాన్ని పరిరక్షించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో జరిగిన ఉర్దూ జానపద సాహిత్య సాంప్రదాయం'పై ఒక రోజు రీసెర్చ్ స్కాలర్ సెమినార్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్త్రీలు కథలు, పాటలు, సామెతలను తరతరాలకు అందజేస్తున్నారన్నారు. అనంతరం పలువురు వక్తలు ప్రసంగించారు. కాగా 'మనూ' మ్యూజిక్ క్లబ్ ద్వారా నిర్వహించిన జానపద గానం అందిరినీ విశేషంగా ఆకట్టుకుంది.

అటు బురద.. ఇటు మురుగు



ఫిలించాంబర్ వద్ద మ్యాన్‌హోల్ నుంచి తన్నుకొస్తున్న బురద



జూబ్లీహిల్స్‌రోడ్ నెం. 5 చౌరస్తాలో పారుతున్న మురుగు

బంజారాహిల్స్: వర్షాల ధాటికి ఏ రోడ్డు చూసినా మురుగు, బురద దర్శనమిస్తున్నాయి. పలు భవనాల సెల్లార్లలో ఊరుతున్న నీటితో పాటు పేరుకుపోయిన బురదను నేరుగా మ్యాన్‌హోళ్ళు, వరద నీటి కాల్వల్లోకి పంపింగ్ చేస్తుండటంతో అవి ఓవర్ ఫ్లో అయి రోడ్డు మొత్తం పారుతున్నాయి. ఫిలిం ఛాంబర్ వద్ద గడిచిన రెండు రోజులుగా పెద్ద ఎత్తున మ్యాన్‌హోళ్ల నుంచి బురద బయటికి వస్తోంది. మరో వైపు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 5 చౌరస్తాలో పెద్ద ఎత్తున మ్యాన్‌హోళ్లు పొంగుతూ మురుగు నీరు కింద ఉన్న కృష్ణానగర్ ప్రధాన రోడ్డు వరకు పారుతున్నాయి. దీంతో ఈ రోడ్డుగుండా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు, స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రం అందజేత



మంజూరు పత్రంను అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.2.50 లక్షల మంజూరు పత్రాలను కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ బాధితులకు అందజేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌కు చెందిన వీరేష్ వైద్యం కోసం జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి పరిస్థితిని వివరించగా ఆయన మంజూరు చేయించారు. దీంతో వీరేష్‌కు ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బి యాదగిరి, రవి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం



బంజారాహిల్స్: గడిచిన కొద్ది నెలలుగా పంజగుట్ట, జూబ్లీ హిల్స్, ఎర్రమంజిల్, ఖైరతాబాద్ మెట్రోమార్గాల్లోని మెట్రో సెంట్రల్ మీడియన్లలో మొక్కలు ఎండిపోయి ఆయా ప్రాంతాలు అందవిహీనంగా కనిపిస్తున్నాయి. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే పంజగుట్ట, ఎర్రమంజిల్ కారిడార్‌లో మెట్రో సిబ్బంది మొక్కలు నాటగా మంగళవారం జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36 మెట్రో కారిడార్‌లో మొక్కలు నాటుతున్నారు.

అమీన్‌పూర్‌లో హైడ్రా దూకుడు

- మున్సిపల్ ఛైర్మన్ అక్రమ నిర్మాణాలూ కూల్చివేత
- రాజకీయ కక్ష సాధింపు చర్యలని ఛైర్మన్ ఆరోపణ



మున్సిపల్ ఛైర్మన్ పాండురంగారెడ్డిని వారిస్తున్న పోలీసులు

పటాన్‌చెరు: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే కాకుండా చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో కబ్జాలకు గురైన చెరువులు, నాలాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. తాజాగా మంగళవారం అమీన్‌పూర్‌లో హైడ్రా హల్‌చల్ చేసింది. సర్వేనంబరు 462లోని ఆక్రమణలను అధికారులు తొలగించారు. అడ్డుకునేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో రావడంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, రెవెన్యూ, పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తాను గతంలో సర్వేనంబరు 461లో కొనుగోలు చేసిన భూమిని చూపాలని డిమాండ్ చేశారు. గతంలోనే తన భూమిని చూపాలని కోరుతూ సర్వే కోసం దరఖాస్తు చేశానని, నేటికీ అది పెండింగ్‌లో ఉందని వాదించారు. అక్రమంగా తన భూమిలోకి వచ్చి కూల్చివేతలకు పాల్పడటం కచ్చితంగా ఇది రాజకీయ దురుద్దేశమేనని వాదించారు. అయితే తాము ఛైర్మన్ భూమిని ముట్టుకోవడం లేదని, కేవలం సర్వేనంబరు 462లో ఉన్న ప్రభుత్వ భూమిని మాత్రమే గుర్తించి దాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని తహసీల్దార్ పి.రాధ స్పష్టం చేశారు. ఛైర్మన్ దాదాపు 17 గుంటల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నాడని అధికారులు తేల్చారు. అందులోని నిర్మాణాలను కూల్చివేశారు. ఫ్యూజన్ స్కూల్ పరిధిలోని కంపౌండ్ వాల్, బాస్కెట్‌బాల్ కోర్టును తొలగించారు. ఆ భూమి సర్వే నంబరు 462లోనిదని తేల్చారు.

ఐలాపూర్‌లో కూడా..

అమీన్‌పూర్ పరిధిలోని ఐలాపూర్ తండాలో సర్వే నంబర్ 119లో అక్రమంగా వెంచర్ వేశారనే ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు మంగళవారం ఉదయం అక్కడ కూల్చివేతలు నిర్వహించారు. ప్లాట్ల హద్దురాళ్లు తొలగించారు. అక్కడ నిర్మాణంలో ఉన్న ప్రహరీలు, గదులను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఐలాపూర్‌లోని ప్రభుత్వ భూముల్లో క్రయవిక్రయాలు అడ్డుకుంటామన్నారు.



సర్వే నంబరు 462లో నిర్మాణాలను ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

ఈసీ వాగులో తగ్గిన వరద ఉధృతి



మండలంలోని కేజీ.దొడ్డి వద్ద ఈసీ వాగులో తగ్గుముఖం పట్టిన వరద

శంషాబాద్ రూరల్: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మండల పరిధిలోని ఈసీ వాగులో వరద ఉధృతి తగ్గిపోయింది. రెండురోజుల కిందట కురిసిన భారీ వర్షానికి ఈసీవాగు పొంగింది. సమీప పంట పొలాలను ముంచెత్తింది. మరో వైపు కాచారం, ననాజీపూర్ పరిసరాల నుంచి ఉన్న ఎంటేరు వాగులో సైతం వరద తగ్గింది. ఈ రెండు వాగుల వరద హిమాయత్‌సాగర్‌కు చేరుతోంది.

గండిపేట చెరువు పరిశీలన



గండిపేట చెరువును పరిశీలించిన నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

మణికొండ: గండిపేట చెరువు నిండాలని, భవిష్యత్‌లో నీటి సమస్య తలెత్తకుండా ఉండాలంటూ నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. మంగళవారం జలమండలి ట్రాన్స్‌మిషన్ డీజీఎం నరహరితో కలిసి ఆమె జలాశయాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చెరువులోకి వచ్చిన చెత్తను తొలగించే పనులను చేపట్టారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేష్‌యాదవ్, నాయకులు గోపాల గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లోకి ఆ గ్రామాలు

- పరిధి పెరిగిన తెల్లాపూర్, అమీన్‌పూర్

పటాన్‌చెరు: తెల్లాపూర్ మున్సిపాలిటీలోకి పటాన్‌చెరు మండల పరిధిలోని గ్రామాలు విలీనం అయ్యాయి. అలాగే అమీన్‌పూర్ మున్సిపాలిటీ, ఓఆర్ఆర్ పరిధిలోని గ్రామాలను విలీనం చేశారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోకి పటాన్‌చెరు మండల పరిధిలోని కర్ధనూర్, ముత్తంగి, పాటి, పోచారం, ఘనపూర్ గ్రామ పంచాయతీలు విలీనం అయ్యాయి. అమీన్‌పూర్ మున్సిపల్‌లోకి అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్, ఐలాపూర్ తండా, పటేల్‌గూడ, దాయర, కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్ గ్రామ పంచాయతీలను విలీనం చేశారు. ఇక నుంచి ఆ గ్రామాలు మున్సిపాల్టీలుగా రూపాంతరం చెందాయని ప్రభుత్వం ఈ నెల 2న వెలువరించిన గెజిట్‌లో వివరించారు. ఔటర్‌రింగ్ రోడ్డు పరిధిలోని గ్రామాలను మున్సిపాలిటీల్లోకి విలీనం చేసే అంశంపై ప్రభుత్వం అధ్యయనం చేపట్టింది. జిల్లా స్థాయి కమిటీతో పాటు రాష్ట్ర స్థాయి మంత్రుల సబ్ కమిటీ ఈ మేరకు అధ్యయనం చేసిన తర్వాత ఆ గ్రామాలను మున్సిపాలిటీలోకి మార్చే ప్రక్రియ పూర్తి చేశారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి,సంగారెడ్డి, రంగారెడ్డి జిల్లాల్లో ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని 45 గ్రామాలను వివిధ మున్సిపాలిటీల్లోకి విలీనం చేశారు. ఆ మేరకు తెల్లాపూర్, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధుల్లోకి ఆయా గ్రామాలు విలీనం అయ్యాయి.

ప్రశ్నార్థకంగా అమీన్‌పూర్ మండలం

అమీన్‌పూర్ మండల పరిధిలోని పంచాయతీలు ఇక మున్సిపాలిటీలుగా మారనుండటంతో వడక్‌పల్లి, జానకంపేట మినహా అన్ని గ్రామాలు మున్సిపల్‌లో విలీనం కానుండటంతో అమీన్‌పూర్ మండలం ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి అమీన్‌పూర్ గ్రామమే మున్సిపల్‌గా రూపుదిద్దుకున్న విషయం తెలిసిందే.

అన్నీ జీహెచ్ఎంసీలోకే...

మున్సిపాలిటీల్లోకి విలీనమైన గ్రామాలన్నింటినీ జీహెచ్ఎంసీ పరిధిలోకే తీసుకువస్తారనే ప్రచారం కూడా ఉంది. అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలను మరో దశలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోకి విలీనం చేస్తారని వినికిడి. గ్రామ పంచాయతీలను తొలి దశలో మున్సిపాల్టీలోకి ఆ తర్వాత కార్పొరేషన్‌లోకి మార్చే ప్రక్రియకు శ్రీకారం చుట్టారని అంటున్నారు.

మున్సిపాలిటీగా ఇస్నాపూర్..?

ఇస్నాపూర్‌ను మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియ కూడా ప్రతిపాదన దశలో ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లో విలీనం అయిన గ్రామాలు పోగా మిగిలిన గ్రామాలను కొన్నింటిని కలుపుతూ ఇస్నాపూర్‌ను మున్సిపాలిటీగా మార్చే ప్రక్రియ కొనసాగుతుందని తెలిసింది. ఇంద్రేశం, బచ్చుగూడ, క్యాసారం, పాశమైలారం, రుద్రారం గ్రామాలతో ఇస్నాపూర్ మున్సిపాలిటీగా అవతరిస్తుందని సమాచారం.